# కలసిరాని కాపరం

[కథ]

శ్రీ పన్యాల రంగనాథరావు

తన భర్త పోయినాడని విన్న తత్క్షణం సుందరమ్మకు దుఃఖం ముంచుకురాలేదు. ఆ వార్త అందిన సమయంలో ఆమె పుట్టింట్లో వుంది. తన వాళ్లంతా రాగాలు పెట్టి, యింటిపెంకులు ఎగరగొడ్తూవుండడం చూసి, సుందరమ్మ బిత్తరపోయింది గాని, ఆపిల్ల కళ్లుకూడా చెమ్మగిల్లలేదు. పెట్టి సర్దుకుంటున్న వెంకటచలం, తన చెల్లెలివైఖరి, ఓ కంటితో గమనించకపోలేదు. ఆ యింట్లో, ఆ సమయానికి ఎవరి స్థానంలో వారు కదలకుండా కూర్చున్నది—సుందరమ్మా, వెంకటచలమూనూ.

చెల్లెలు, కనీసం కంటతడి అయినా పెట్టకపోవటం చూసి, వెంకటచలం, ఏ మాత్రమో ఆశ్చర్యపడకపోలేదు. చివరకు తనుకూడా ఉద్వేగాన్ని అణచుకోలేకపోయినాడు. అయితే తన అదుపు దాటి పొంగివస్తున్న దుఃఖం, తన బావ పోయినాడని కాదు. అది, తన చెల్లెలి భావినిగురించే అని తనకు బాగా తెలుసును.

ఒక్క అయిదునిమిషాలలో ఆయిల్లు యిల్లంతా హోరెత్తిపోసాగింది. ఇరుగుపొరుగులవాళ్లు వొక్కొక్కరే రావటంకూడా ప్రారంభమయింది. సుందరమ్మకు ఈ బహిరంగప్రదర్శనం నచ్చదు. ఆమె అటువంటి పిల్ల. తన అక్కచెల్లెళ్లందరిలోనూ వెంకటచలానికి సుందరమ్మ అంటే, చిన్నప్పట్నుంచీ పంచప్రాణాలుగా వుండేది. అతనిమూలంగా ఆమెకు చాలావరకు సంస్కారమబ్బింది. సుందరమ్మ ఈ అసంఖ్యాకమైన జనరోదనం భరించలేక చప్పున లేచి, మేడమీదకు పోయింది. తన అన్నగదిలోనికి వెళ్లి, తలుపు చేరవేసుకుంది.

సుందరమ్మ లేచి, పైకి వెళ్లటం కనిపెట్టిన వెంకటచలం, తను సర్దుతున్న పెట్టె మూసేసి తనుకూడా పైకి పోయినాడు.

సుందరమ్మభర్తకు క్షయ ఎక్కువైందని ఆవుదయమే ఒక కార్డు అందింది. "ఇటువంటి సమయంలో ఒక టెలిగ్రామివ్వటానిక్కూడా, ఈ పిసినారిగాళ్లకు చేతులు రాలేదేమో!" అని అగ్గిరాముడై వెంకటచలం సాయంత్రం బండిలో చెల్లెల్ని తీసుకుపోవటానికి సామాను సర్దుకుంటున్నాడు. అంతా అయిపోయినాక ఆ సమయంలోనే, ఈ శుభవార్త ఇప్పుడు టెలిగ్రాముద్వారా తెలిసింది.

చేరవేసివున్న తలుపు తీసి, తను గదిలోనికి వెళ్లటం మంచిదా కాదా అని వెంకటచలం కాస్త ఆలోచించాడు. గదిలో దీపం వెలిగించినట్టు కనపడదు. సుందరమ్మ ఒక్కతే, ఏడుస్తున్న చప్పుడుకూడా లేదు. లోనికి వెళ్లటం విరమించుకుని, వెంకటచలం పక్క పిట్టడాబామీదకు పోయాడు. కొద్దిదూరంలో సముద్రపు హోరు వినిపిస్తోంది. ఆకాశం కలిసేచోట నీలిగా సముద్రపు నీరు కనిపిస్తోంది. చాలాదూరంలో, సముద్రతీరమూ, తీరాన వున్న రాళ్లు, ఆ రాళ్లమీద చిన్న చిన్న కెరటాలూకూడా కనిపిస్తున్నవి.

వెంకటచలం ఒక సిగరెట్టు తీసి ముట్టించాడు. సరిగ్గా అదే చోటున అయిదేళ్ల క్రితం, తనూ, తన ప్రాణస్నేహితుడైన వెంకటరత్నమూ కూర్చుని, తమ భవిష్యత్తు చర్చించుకున్నారు.

తన చెల్లెలిమొగుడు బతికే వున్నప్పటికీ, ఆరోజుమాత్రం తను మరచిపోలేదు. అందులో, తనేదో

పవిత్రమైన ఒక సెంటిమెంటు ఏర్పాటు చేసుకున్నాడు.

చదువైపోయాక అయిదేళ్లపాటు తను యింట్లో కూర్చొన్నా వెంకటచలాన్ని అడిగేవారు లేరు. వెంకటరత్నం అట్లా వున్న పక్షంలో, ముసలి తల్లీ, తమ్ముడూ మాడిపోతారు. ఆ రోజులలో వెంకటరత్నం ట్యూషన్లు చెప్పుకునీ, రోజుకి రెండుగంటల పాటు ఏదో దిక్కుమాలిన దుకాణంలో వుత్తరాలు రాసిపెట్టీ, కథలు రాసి పత్రికలకు పంపుకునీ నెలకో వందరూపాయలు గిట్టుబాటు చేసుకుంటూ వుండేవాడు. అటువంటి అస్థిమితమైన ఆర్జన ఎన్నాళ్లు సాగుతుంది గనక? వెంకటరత్నానికి బొంబాయిలో, ఒక ఫాక్టరీలో ఫోర్‌మన్‌ వుద్యోగం దొరికింది. దాన్ని అదృష్టమన్నా వెంకటరత్నానికి అభ్యంతరం లేదు. ఆనాడు, తన ఈ కొత్త ఉద్యోగంగురించి చెప్పటానికే వెంకటరత్నం వెంకటచలందగ్గరకు వచ్చాడు. అప్పటికి వెంకటచలం ఉద్యోగప్రయత్నం అంటూ ఏదీ ఇంకా చేయటం లేదు. సరిగ్గా అదే రోజున, తన చెల్లెల్ని "చూసుకోటానికి" ఒక సన్నటికుర్రాడు వచ్చాడు. ఆ కుర్రవానితో కొంత బంధుజనమున్నూ వచ్చింది. కుర్రవాడంత అనాకారి కాడు. దేహంలో ఎక్కడా రక్తపుచుక్క లేనంత పాలిపోయివున్నాడు. అయితే అతనిలో దేహదౌర్బల్యం కనపడలేదు. బిళ్లకట్టుపంచ కట్టాడు. ఖద్దరులాల్చీ తొడిగాడు. ఉత్తరీయంకూడా వుంది.

"ఆ కుర్రవాణ్ణి కనిపెట్టావా?" అన్నాడు వెంకటచలం.

"లోనికి వస్తుండగా చూశాను. వీణతీగలు సరిచేస్తున్నాడు. ఎవరో సంగీతపుమేష్టరనుకున్నాన్లే!" అన్నాడు వెంకటరత్నం నవ్వుతూ.

"ఆఁ. వీణ బాగా వాయిస్తాడులే. అంతా సంస్కృతమయం—" అన్నాడు వెంకటచలం అంత శ్రద్ధ లేకుండా.

"సుందరమ్మ వీణ నేర్చుకుంటుందా యేమిటి?" అన్నాడు వెంకటరత్నం.

"అతను వీణమేష్టారు కాడు. బహుశా సుందరమ్మను పెళ్లిచేసుకుంటాడనుకుంటాను." ఈ మాటలు వెంకటరత్నానికి చాలా అయోమయంగా వినిపించినై. దూరాన సముద్రపుహోరంతా తన్ను చుట్టుముట్టినట్టయింది. చప్పున అతనికి నోట మాటకూడా రాలేదు.

"సుందరికి వెంటనే పెళ్లిచేయాలని అమ్మ మొన్న చాలా గొడవచేసింది. వీరెవరో మాకు అంత దగ్గర బంధువులుకూడా గాదు. ఎక్కడో వంశవృక్షం అంతా తిరగవేస్తే ఏకొసనో వున్నారు. నాకు బావమరదివరస గోరువాసిలో సరిపడ్తుంది. అయితే బాగా పులిసిపులుపెక్కి వున్నవారు. చాలా ఛాందసం కూడాను. వాళ్లపులుపు చూసి అమ్మ పట్టు పట్టిందంటే పట్టదూ మరీ? ఆడదానికి ఏం కావాలి? డబ్బు. ఆడది పుట్టకముందు డబ్బు పుట్టింది. ఆ డబ్బుతో కవలపిల్లల్లే ఆడది పుట్టింది. తరవాత జరగాల్సిందేదో జరిగిందే అనుకో. ఆ కుర్రవాడూ, తల్లీ, ఎవడో వాళ్లబంధువూ అంతా దిగబడ్డారు. వీళ్ల మొహానికి కతికితే అతకదుట. ఏదో ఏడిసిందిలే. వాళ్లవంటలు వాళ్లవి. అల్లా వుంది ప్రస్తుతం—" అని ముగించాడు వెంకటచలం. మరి కాస్తసేపు వెంకటరత్నం మౌనంగానే వుండి—

"పిల్ల నచ్చిందటనా?" అన్నాడు.

"ఆ విషయం ఇంకా కనుక్కోవాలి. నీ తెలివిగాని, అరటిపండొలిచి నీనోటికందిస్తే నీకేం చేదా?" అన్నాడు వెంకటచలం.

"కట్నంకూడా వుందన్నమాటే!" అన్నాడు రత్నం సిగరెట్టు ముట్టిస్తూ.

"పోనిస్తూ, ఏదో తగలడ్తారు. అనుకున్నది అనుకున్నట్టు ఎన్నడూ జరగదు. ఎన్ని ఏమనుకుంటే లాభమేమి టుంటుందీ? దాని కేదో నేను కాస్త ప్రపంచం చూపించాను. అక్కడికదే నా తృప్తి." అన్నాడు వెంకటచలం. అతనిమాటలో అస్పష్టంగా వున్న అసంతృప్తిని రత్నం గ్రహించకపోలేదు.

"నువ్వెప్పుడు ప్రయాణం కడ్తున్నావు?"

"వొచ్చే బుధవారంనాడు బయల్దేరితే చాలు. కాని, రేపే పోదామని ఇప్పుడే నిశ్చయం చేసుకున్నాను" అన్నాడు రత్నం దూరాన కెరటాలకేసి చూస్తూ.

"ఇవేళ ఈ యింట్లో కలుగుతున్న పరిణామాలు నీకు కొంత బాధ కలిగించి వుండవచ్చు." అన్నాడు వెంకటచలం--తనే బాధపడుతున్నట్టు తనకు తెలిసీకూడా.

"ఒక్క విషయం గుర్తుంచుకో చలం! ఎవరి కష్టసుఖాలకు ఎవరు కర్త లంటావు? నువ్వేదో ఒక ఆదర్శాలతో నిండి వున్న ప్రపంచాన్నే వూహించుకుంటావు. నీ పద్యాలు చదివినా నా కదే కనిపిస్తుంది. కాని, యథార్థంగా చూస్తే కేవలం నీకు నువ్వే విరుద్ధంగా వుంటావు. ఈ ప్రపంచంలో ఏ ఖర్మం చాలకో పుట్టావు. చూస్తుమాస్తూ ఆత్మహత్య చేసుకో లేవుకదా! సహజంగా మృత్యువు ఎదురయ్యేవరకూ నువ్వు బతికి తీరాల్సిందే. ఆ బతుకు దుర్భరం చేసుకోటం దేనికీ! మనుషులంగనక, కోరిక లుంటాయి గనక, ఏవో ఏవో వూహిస్తాము. ఆ వూహలు ఫలించవు. విచారించటం ఎందుకూ? అక్కడి కది మరచి పోవటం ఉత్తమం. కొన్ని మరచిపోలేం—సులభంగా అసలు మరవలేం—ఆ మరవలేనివి జీవితాంతం కూడా ఒక్కొక్కప్పుడు బాధించటంకూడా కద్దు. నన్నడుగుతే బాధపడాల్సిందే అంటాను. అక్కడి కంతే మరి. నా కేదో బాధ అని నువ్వు దిగులుపడ మాకు. ఆ బాధ అనేది బాధే అయితే, సాధ్యమైనంత వరకూ అది శాశ్వతం కాకుండా చూసుకోడానికి ప్రయత్నిస్తాను.

ఈ కారణంచేతనే వెంకటచలం ఆరోజును సులభంగా మరచిపోలేదు.

రత్నం వెళ్ళిపోయి అయిదేళ్ళయింది. అతని కామధ్య పెళ్ళికూడా అయింది. కొడుకుకూడాను. బహుశా మూడేళ్ళుంటాయి. ఈమధ్య రత్నానికీ తనకూ ఉత్తరప్రత్యుత్తరాలుకూడా అట్టే నడవటం లేదు. రేపే రాయాలని అనుకున్నాడు వెంకటచలం.

సిగరెట్టు పూర్తిచేసి, వెంకటచలం తిరిగి తన గదిదగ్గరకు వచ్చాడు. చేరవేసిన తలుపులు చేరవేసినట్టే వున్నవి. కింద రణగణధ్వనులు కొద్దిగా తగ్గినై. సుందరమ్మను ఊరడించాలనే ఉద్దేశంతో బహుశా, అమ్మా వాళ్లూ ఎవరైనా పైకి రావచ్చునేమో అని అనుమానం కలిగింది వెంకటచలానికి. కాని, ఎవ్వరూ పైకి రాలేదు. వస్తూన్న అలికిడీ లేదు.

వెంకటచలం గదితలుపు చప్పుడుకాకుండా తీసి లోనికి అడుగుపెట్టాడు. గది అంతా చిమ్మచీకటి. వెన్నెలరాత్రికూడా కాదు. తన కీ యేడాది లోనే పెళ్లిచేయాలని తండ్రి కొత్తగా కట్టించిన గది. వెన్నెలరాత్రులు కిటికీలోంచి వెన్నెల మంచమంతా పడేటట్టు తనే ప్లాను వేసుకున్నాడు.

దీపం వెలిగించకుండానే, మంచందగ్గర కుర్చీలో కాస్సేపు కూర్చున్నాడు వెంకటచలం. సుందరమ్మ పడుకుని వుంది. ఆమె వొంటరిగా అంత దుఃఖించినట్టు ఎన్నడూ దుఃఖించలే దని వెంకటచలం గ్రహించాడు.

సుందరమ్మ అట్లా పడుకునే చాలా యేడ్చింది. దిండంతా తడిసిపోయిందికూడాను. కాస్సేపటికి ఒక్కసారి మతివచ్చినదానిలాగా లేచి, ఈ యేడు పంతా దేనికోసం అని ఆత్మపరీక్ష చేసుకోవటం ప్రారంభించింది.

తన ఈ అయిదేళ్ల వైవాహికజీవితంలోనూ సుందరమ్మ భర్తతో కాపరంచేసింది బహుశా కొన్ని నెలలు మాత్రమే వుంటుంది. వేళ్లమీద లెక్కపెట్ట వచ్చునుకూడా. తనకు పెళ్లిఅయిన మూడునెలల్లోపుగానే కార్యమవటమూ, వెంటనే అత్తవారింటికి పోవటమూ జరిగినై. అత్తవారిది పల్లెటూరు. ఆ వూరికి తమరే పెద్దలు! ఇల్లు ఎంత పెద్దదో అంతమందీ యింట్లో లేకపోలేదు. ఇద్దరు వదినలు యింట్లోనే కాపరాలు పెట్టారు. అల్లుళ్లు యిల్లరికాలు వెలిగిస్తున్నారు. ఒక మరది, వేదపారాయణం అభ్యాసం చేస్తున్నడు. మామగారు ముసలి తొక్క. తన మామగారికి ఈ అత్తగారు రెండో పెళ్లాం. తన అత్తగారికి

తన భర్తా, మరదీ మాత్రమే సంతానం. వదినలు మొదటి పెళ్లాం బాపతు. ధనధాన్యాదులు పుష్కలంగా వుండడం మూలాన్న తిండికి ఎవ్వరికీ లోటు లేదు. కాని, తనుమాత్రం ఆ యింటికి వెళ్లి ఒక పనికత్తె అవడం ఆమెను చాలా బాధించింది. ఇంట్లో ఆడ వాళ్లకు లోటు లేదు. కాని చాకిరీ చెయ్యటానికి ఎవ్వరూ కూర్చున్నచోటునుంచి లేవరు. అందరి కిందా పక్కలుకూడా దులిపి వేయటానికే సుంద రమ్మ ఆ యింటికి కోడ లయింది. ఈ వ్యథల్లో, యింట్లో సవతిపోరు. వదినలకూ, సవత్తల్లికీ అర నిమిషం పడేది కాదు. వారిమధ్య నలిగిపోయేది సుందరమ్మ.

మొదట్లో సుందరమ్మభర్త సుందరమ్మతో చాలా ప్రేమ వెలిగించటం చూసి సుందరమ్మ ఫరవా లేదు అనుకోకపోలేదు. ఆ ప్రేమమాత్రం అంత మితి మీరి వుంటుం దనికూడా సుందరమ్మ ఎన్నడూ వూహించలేదు. మధ్యాహ్నం ఒంటిగంటవరకూ యింటిపని అంతా చేసి అలసి కాస్త నడుం వాల్చే సరికి, తన భర్త తన్ను గదిలోనికి రెక్కపట్టి లాక్కు పోవటం మొదట చూసి సుందరమ్మ వొణికిపోయింది. శుష్కించివున్న తన భర్తకు కామవాంఛ యింత ప్రబలంగా వుంటుం దని తెలుసుకుని ఆమెకు తన సంసారం అంటే యేమిటో కనువి ప్పయింది. తను ఏవిధంగానూ, ఎవర్నీకూడా ఎదిరించటానికి శక్తి కూడా లేదు. భర్తే ఇటువంటి ప్రవర్తనలో వుంటే, కష్టసుఖాలు ఇం కెవరితో చెప్పుకోవడం ?

కాపరానికి వెళ్లి రెండు నెలలు తిరక్కుండానే ఆమెకు కడుపులో నెప్పి ప్రారంభమయింది. ఆ నెప్పేమిటో తెలియటానికి ఆ గ్రామంలో వైద్యుడు కూడానా ! నాటువైద్యుడు వచ్చి, ఏవో పొట్లా లిస్తే నెప్పి ఎక్కువైందే గాని, తగ్గలేదు. పెద్దవైద్యం చేయిస్తే, ఖర్చు జాస్తి అయ్యేటట్టు తోచింది యింటి వారికి. కోడల్ని పుట్టింటికి పంపేశారు.

వెంకటచలానికి ఈ విషయాలన్నీ తెలుసును. ఈ ప్రపంచంలో సుందరమ్మకు అన్న వొక్కడే దిక్కు. ఆమె సిగ్గుపడకుండా అన్ని విషయాలూ అన్నతో చెప్పింది.

ఆ యేడాది సుందరమ్మ మళ్లీ అత్తవారింటికి పోలేదు. కొన్నాళ్లతర్వాత భర్త వచ్చి తిరిగి సుంద రమ్మను తీసుకుపోయాడు.

ఈ అయిదేళ్లూ యిట్లానే జరిగింది. చివరి రోజులలో, సుందరమ్మభర్త ఆమెను కొట్టడంకూడా అలవాటుచేశాడు. ఇంటిచాకిరీ చేయకపోతే, తేరకు పడి వుండి తింటున్నవాళ్ల అధికారం తట్టుకోటానికి లేకుండా వుంది. తీరిక వున్నప్పుడల్లా భర్తతో వుండక పోతే అతను కొట్టడం ప్రారంభించాడు.

మొదట్లో అతను దగ్గే దగ్గు ఎవరికీ పట్టలేదు. పొడిదగ్గు మాదిరిగానే వుండేది. అలవాటుగా సుంద రమ్మ కడుపునొప్పి జాస్తి అయి, పుట్టింటికి వచ్చాక, ఒకరోజున భర్తకు క్షయ వచ్చినట్టు వుత్తరం వచ్చింది. సుందరమ్మ గ్రామం వెళ్లే స్థితిలో లేదు. అల్లుణ్ణి పట్నం తీసుకురమ్మనీ, ఇక్కడే వైద్యం చేయిద్దా మనీ, కాకుంటే మదనపల్లి తీసుకువెడదామనీ వెంకట చలమే నాన్నగారితరఫున వుత్తరం వ్రాశాడు.

అత్తగారికి ఇంగ్లీషువైద్యంలోనూ, మదనపల్లి కాపరంలోనూ నమ్మకం లేదు. తెనుగువైద్యం బాగా వుందని సమాధానం రాశారు. రోజూ దిష్టి తీయిస్తున్నా మన్నారు. మంత్రాలు వేస్తున్నామన్నారు. పట్నం రావటానికిమాత్రం వొప్పుకోలేదు. చివరకు మరో ముక్కకూడా రాశారు. కోడలికి కాస్త నయమైన వెంటనే పంపమని రాశారు.

"వెధవ సంత, వెధవ సంబంధం!" అని అన్న అంటున్న మాటలు సుందరమ్మ వినకపోలేదు. ఆమె మనసులో కొద్దిగా చివుక్కుమనకపోలేదు. ఇం కేముంది ? నెల్లాళ్లు తిరక్కుండానే అనుకున్నంతా అయింది. ఇప్పుడు తన కేం మిగిలింది ? ఇరవైమూడే ళ్లయినా నిండకుండానే ఈ జీవితం పూర్తి అయి నట్టేనా ?

తన భర్తను తను ప్రేమించిందీ, లేనిదీ ఆత్మపరీక్ష చేసుకోటానికి సుందరమ్మకు ఎన్నడూ తగిన సమయం

చిక్కలేదు. అసలా విషయమే జ్ఞాపకం రాలేదు. తనచేత తన భర్త యింటిల్లపాదికీ చాకిరీ చేయించాడు; తన్ను యిష్టం వచ్చినట్టు అనుభవించాడు. తన్ను తిట్టాడు; కొట్టాడు. అన్నింటికీ సుందరమ్మ వోర్చింది. ఈ వోర్పేనా ప్రేమ? ప్రేమ లేకుంటే వోర్పే దేనా? వోర్పుకీ ప్రేమించటానికీ అసలు సంబంధం ఎక్కడా? వోర్పు వేరు. ప్రేమ వేరు. ప్రేమించుకునేవాళ్లుమాత్రం బాధలు ఓర్చుకోలేక విడిపోవటం లేదూ? కనీసం, ప్రేమలో తను తన భర్తతో ఎన్నడూ మాట్లాడినట్టుకూడా సుందరమ్మకు జ్ఞాపకం రాలేదు. అది ప్రేమ కాకపోవచ్చు. తను అసలు వాస్తవంగా తన భర్తను ప్రేమించలేదు. ప్రేమించటం అంటే సుందరమ్మకు అదొక ఆదర్శం—అది నిష్కారణంగా ఇక్కడ బూడిదలో పోసిన పన్నీరు కాలేదు—ఆ పన్నీరు తనహృదయంలోనే ఇంకా భద్రపరచుకుంది.

తనభర్తతన్ను ప్రేమించివుంటే వుండవచ్చు. కాని ఆ విషయం సుందరమ్మఅంతరాత్మ వొప్పుకో లేదు. అతను సుందరమ్మను కామించాడు. తన కామతృప్తిని అసహజంగా తీర్చుకున్నాడు సుందరమ్మ మీద.

సుందరమ్మకు భగవంతుడంటూ వున్నాడు. తన కడుపున ఏ పండో పండితే ఆనందిద్దామని తల్లి వాంఛించినా సుందరమ్మపాలిట అటువంటిది లేకపోవటం, ఆ పుట్టవలసిన గుడ్డుకే ఎంతో మేలయినట్టు భావించింది. గతిలేనిపిల్ల పుట్టేకన్నా పుట్టకపోవటమే ఆ పిల్లకు తను చేసిన ఉపకారం అనుకున్నది సుందరమ్మ.

ఇక తను? తనకు ఇరవైమూడుయేళ్లు నిండలేదు. ప్రపంచంఅంతా తన్ను 'ముండ' అంటారు. చిన్నతనంలోనే పాపం ముండమోసింది దని నలుగురూ నాలుగువిధాలా సానుభూతి చూపుతారు. పరామర్శిస్తారు. ఇంక మళ్లీ తల్లీ, తండ్రీచాటునే పడివుండాలి కదా! అన్నకు పెళ్లి కాకపోదు. అత్తింట్లో వెనక చాకిరీ చేసింది వదినలకింద. ఇప్పుడు పుట్టింట్లో వదినకు చాకిరీచేయటానికి తాను సిద్ధమయిందన్నమాట. ఎక్కడికక్కడికే—అక్కడి చాకిరీకన్న యిదే నయం!

సుందరమ్మకు ఈ ఆత్మపరీక్షతో పూర్తిగా అసలు కన్నీళ్లు రావటం మానేసినై. ఆమెకు మనసులో ఇంకా ఏ ఆలోచనలూ మిగలలేదు. ఆమె మెల్లగా పడుక్కునే తల యెత్తింది. పక్కనే పరుపు మీద చప్పుడయింది. చల్లనిచేయి వచ్చి ఆమెనొసటి మీద పడింది.

"చెల్లీ!"

ఆ పిలుపు అతిమెల్లగా ఆమెకు వినిపించింది ఆమెగొంతుకూడా పట్టుకుపోయి వుంది. ఇంతసేపూ ఆమెగుండెలో అణగిపోయిన దుఃఖం యావత్తూ ఒక్క ఉప్పెనగా పైకి పొంగివచ్చింది.

"అన్నయ్యా!" అంటూ, వెంకటచలంవొళ్లో తల పెట్టి, తన జీవితంలో మొదటిసారిగా సుందరమ్మ భోరుమని యేడ్చింది. వెంకటచలానికి కళ్లు చెమ్మగిల్లినై. అతనికి తెలియకుండానే రెండు చుక్కలు, సుందరమ్మ చెక్కిళ్ల మీద పడినై. అయిదునిమిషాలవరకూ ఎవరూ మాట్లాడుకోలేదు. ఆమెదుఃఖపు ఉప్పెన కొద్దిగా తగ్గింది.

ఎవరిఎదట తనకీ విధంగా ఆపుకోలేని దుఃఖం వచ్చింది? ఇంత దుఃఖం ఈ త్రుటికాలంలో రావటానికి కారణమేమై వుండాలి? సుందరమ్మప్రేమను పంచుకోటానికి వెంకటచలంతప్ప ఇంకెవరు? ఆ దుఃఖం అందుకే కదూ వచ్చింది? తనగతి చూసేది ఈ ఏకోదరుడుతప్ప ఇంకెవరున్నారుగనక?

కావలసిన కర్మలన్నీ యథావిధిగానే జరిగిపోటానికి ఎవ్వరూ ఏ ఆటంకాలూ పెట్టలేదు. వెంకటచలం ఎటువంటి జోక్యమూ కలగజేసుకోలేదు. చేసుకునే హృదయపటుత్వమే తనకు వుంటే బహుశా ఈ పెళ్లే జరక్కుండా చేసేవాడేమో! వెంకటచలం అనుకున్నదీ అదే. దీనికి కారణం తనకు స్వేచ్ఛ లేకపోవటం. ఆర్థికస్వేచ్ఛ అనేది ఎంతైనా మనోబలాన్ని ఇస్తుంది—దాన్ని సక్రమంగా వినియోగించుకున్న

ట్లయితే. అప్పటివరకూ తను నిరుద్యోగే. తండ్రిచాటున బ్రతుకుతున్నవాడు. తనమాట చెల్లుతుందనే విశ్వాసం అంతవరకూ కలగలేదు.

అయితే ఇప్పుడు చెల్లెలికి జరిగిన ఈ అన్యాయం వెంకటచలానికి కొంత నైతికబలాన్ని సమకూర్చింది. ఈమధ్య సుందరమ్మవిషయం ప్రస్తావనకు వచ్చినప్పుడల్లా, ఆ పిల్లకు జరిగిన అన్యాయాన్ని పురస్కరించుకుంటూ తల్లితోనూ, తండ్రితోనూ వాదించటం ప్రారంభించాడు. సుందరమ్మే అనేకసార్లు వాదించింది.

"చదు వెందుకురా?" అన్నది తల్లి.

"అది నీకు సంబంధించిన విషయం కాదు." అని కేకలువేశాడు వెంకటచలం. ఈ కేకలు విని తండ్రి మాట్లాడలేదు.

సుందరమ్మను హైస్కూలులో చేర్పించాడు వెంకటచలం. తనకు వ్యవధి వున్నప్పుడల్లా ఆమెకు పాఠాలు చెప్పటం ప్రారంభించాడు.

వెంకటచలం ఉన్నచోటనే ఇప్పుడు ఉద్యోగంలో ప్రవేశించాడు. కాని, అది తన ఆదర్శాలకు సరిపడేది ఎల్లా అవుతుంది? ఊరికే కూర్చోటం మంచిది కాదనే అభిప్రాయంతో ఏదో ఒకదానిలో ప్రవేశించాడు. ఏ ముహూర్తాన ప్రవేశించాడో గాని, వెంకటచలానికి ఈ ఉద్యోగంతో ఉన్న మనశ్శాంతికూడా పోయిందనిపించింది.

సుందరమ్మ స్కూలుఫైనలు ప్యాసయింది. అప్పటికి ఆమెభర్త పోయికూడా నాలుగైదేళ్ళయింది. అంతా మరచిపోయారుకూడాను. కాని సుందరమ్మ మాత్రం, తను విధవ అనే విషయం ఎట్లా విస్మరిస్తుంది? మరపింపచేయటానికి వెంకటచలం శతవిధాలా ప్రయత్నించాడు. కాని ఆశే గెలవలేదు.

వెంకటచలానికి ఇంతవరకూ పెళ్లి కాకపోవటంలో ఆశ్చర్యమేమీ లేదు. అతని కిప్పుడు ముప్ఫయ్యేళ్లు వస్తున్నాయి. చెల్లెలివిషయం ఏదో పరిష్కరించాక, తనగురించి ఆలోచించుకోవాలని వెంకటచలం అనుకుంటున్నాడు. తన్నుగురించి యితరులు ఆలోచించటం అతని కిష్టం లేదు. "నా కిప్పట్లో పెళ్లీ, పెడాకులా వద్దు. కావలసినప్పుడు నేనే చేసుకుంటాను. సద్యా నాకు ఢిల్లీలో వుద్యోగమయింది. రేపే పోతున్నాను" అనేటప్పటికి అంతా ఆశ్చర్యపడ్డారు. పడరూ మరీ?

ఢిల్లీలో వెంకటచలానికి అయిదువందల జీతం వచ్చే వుద్యోగం దొరికింది. అతను ఢిల్లీ పోతున్నముందు, ఒక్క సుందరమ్మతోమాత్రమే గంటసేపు మాట్లాడాడు. ఏ మ్మాట్లాడేడో ఇంట్లో ఎవ్వరికీ తెలీదు.

ఢిల్లీలో వెంకటచలానికి వెంటనే యిల్లు దొరకలేదు. తను యింటికోసం ప్రయత్నంకూడా చేయలేదు. హోటల్లోనే ఒక గది తీసుకుని ఉంటున్నాడు.

వెంకటచలం ఢిల్లీ వచ్చినతర్వాత, ఒకవారం రోజులు పోయినాక, సుందరమ్మకు వుత్తరం రాశాడు. ఆ వుత్తరం స్వయంగా పోస్టుచేయటానికి పోస్టాఫీసుకు పోయి, అక్కడ ఒక క్షణంపాటు ఒక వ్యక్తిని పరీక్షిస్తూ నిలపడ్డాడు.

"ఒరేయి! వెంకటచలం!" అన్నాడు రత్నం.

"ఎంచేతనో చూడగానే పోల్చలేకపోయానోయ్ వెంకటరత్నం!" అన్నాడు వెంకటచలం.

"నాబొజ్జగాని పెరగిందా!"

"బొజ్జే లేనిదే ఎక్కడ పెరుగుతుందీ! పద—ఇక్కడేమిటి—హోటలుకు పోదాం."

ఉభయులూ హోటలు చేరుకోగానే పక్కగదిలో వున్నవారొకరు వచ్చి—"మీ కొక జాబు వచ్చింది. బహుశా మీరు బోర్డులో చూడలేదని తెచ్చాను" అంటూ వుత్తరం ఇచ్చారు. ఆ వుత్తరం ఆఫీసుకు వస్తే, అక్కడివాళ్లు ఆఫీసులో ఇవ్వడం మరచి హోటలుకు పంపారు.

ఉత్తరం చదువుకుని, వెంకటచలం—"ఈ వుత్తరం నువ్వుకూడా చదవ్వొచ్చు" అని రత్నానికి అందిచ్చాడు.

అది సుందరమ్మ రాసిన వుత్తరం. అన్నకు కొత్త పట్నంలో అధైర్యపడవద్దని ధైర్య మిచ్చింది. తనగురించి దిగులుపడవద్దని రాసింది. అంతే.

"సుందరమ్మ పుట్టింట్లో వుందా?" అన్నాడు వుత్తరం ముగించి వెంకటరత్నం.

"ఈ అయిదేళ్ళలోనూ, నువు వెళ్ళిపోయినాక జరిగిన అసలు కథేదో నీకు తెలియజేయకపోవటం నాదే పొరపాటు. సుందరమ్మభర్త పోయి అయిదేళ్ళయింది..."

వెంకటరత్నం, ఆనాడు సుందరమ్మపెళ్ళి కాబోతుం దని విని ఎంత విస్తుపోయినాడో, ఇప్పుడు మళ్ళా, రెండోసారి అదేవిధంగా విస్తుపోయినాడు.

వెంకటచలం జరిగిన కథ యావత్తూ చెప్పాడు. అంతా విని నిట్టూర్చి, రత్నం—

"నన్నూ, సుందరమ్మనూ ఏదో ఒకే గ్రహం పీకుతున్నట్టుందిలే" అన్నాడు. వెంకటచలానికి అర్థం కాలేదు.

"నీ కర్థం కా దని నాకు ముందే తెలుసును. కాని, నేను నిజమే చెప్తున్నాను. నేనుకూడా అప్పట్లోనే పెళ్ళి చేసుకున్నాను. చేసుకోవట మేమిటి! చేసుకోక తప్పలేదు. కాని, నాకు భార్య దక్కేరాతమాత్రం లేదు. ఆమెను ఏడాదిలోపునే పోగొట్టుకున్నాను. ఇప్పుడు నాకు ఏడేళ్ళ కొడుకు."

ఇప్పుడు వెంకటచలం స్తబ్ధుడైనాడు. చిత్రవిచిత్ర జీవితాలు! మనుషులు కొందరు ఎంతలో జీవితాలు పూర్తి చేసుకుంటూరు!

"నీకూడా నేను వుత్తరం రాయక పెద్ద పొరపాటే చేశా నని ఎరుగుదును. ఇప్పుడు నే నీ వూరు వచ్చిం దెందు కనుకున్నావు?"

"చెప్పు!" అన్నాడు వెంకటచలం.

"నేను మళ్ళీ వివాహం చేసుకోబోతున్నాను." అన్నాడు వెంకటరత్నం.

"ఎవర్ని?"

"ఇక్క డెవరో రేడియోఇంజనీ రున్నాట్టలే. ఆయనకు ఇద్దరు చెల్లెళ్ళుట. ఎవర్నైనా చేసుకోవచ్చునట".

"నీ కోసమేనా, లేక నీవాళ్ళకోసమా!"

"ఎవరికోసమూ కాదు. ముందు నా కొడుకోసం, తరువాత నాకోసం—" అన్నాడు వెంకటరత్నం.

వెంకటచలాని కనేకఆలోచనలు పోయినై కాని ఏం లాభం? ఒకటికూడా ఫలించకపోవచ్చు.

రత్నం ఈ యిద్దరిలోనూ ఎవర్నో వొకర్ని చేసుకోవచ్చు. అ డ్డేముంది?

కాని, రత్నానికి ఈ పిల్లలు ఎవ్వరూ నచ్చకపోయిన పక్షంలో, సుందరమ్మవిషయం ప్రస్తావనకు తెస్తే? తన కిది మంచి ఆలోచనే. రత్నానికూడా ఎటువంటి అభ్యంతరాలూ ఉండకపోవచ్చును.

మర్నాడు రత్నం వచ్చినప్పుడు వెంకటచలం ముందే అడిగాడు: "ఏం? ఎవరేనా నచ్చేరా?" అని.

"పోనిస్తూ. డబ్బుదండగవ్యవహారం. ఏదో చదువుకున్నారని విని వచ్చాను. ఏడిసినట్టుంది. చూడ్డానికి బయటకే రాకపోతే నే నేం చేసేదీ! ఎంత మాట్లాడినా ఆ తేభ్యం ఇంజనీరూ, వాడి తల్లీ మాట్లాడతారేగాని ఓ పిల్లా బయటకు రాదు. వాళ్ళతో మాట్లాడలేక అలసిపోయి వచ్చేశాను." అన్నాడు వెంకటరత్నం.

"అయితే మరి ఇక్కడికీ ప్రయత్నం సున్నా?" అన్నాడు వెంకటచలం.

"అన్నమాటే."

"నువు నిన్న సుందరమ్మవుత్తరం చదివావు కదూ! ఆపిల్లగురించి నీ అభిప్రాయ మేమిటి?" అని కదిలించాడు వెంకటచలం.

"బుద్ధీ జ్ఞానమూ వున్న తల్లిదండ్రులు అటువంటి పిల్లకు తిరిగి వివాహం చేస్తారు. కనీసం నాదృష్టిలో" అన్నాడు రత్నం. రత్నం ఈ విధంగా సమాధానం ఇవ్వటంవల్ల తన కున్న సందేహంలో సగం పోయింది.

తనకు ఇప్పుడు ఉద్యోగ ముంది. తన తల్లిదండ్రుల కిష్టం లేకపోతే తనే సుందరమ్మకు పెళ్ళి చేయవచ్చును. ఈ నైతికబలమే అతని కెంతో ధైర్య మిచ్చింది.

"నీ కభ్యంతరం లేకపోతే, నా ప్రయత్నాలు నన్ను చేయమంటావా?" అన్నాడు వెంకటచలం.

వెంకటరత్నం చప్పున సమాధాన మివ్వలేకపోయినాడు. అతని కందనిపండు నోటిదాకా వచ్చే అవకాశాలు కనిపించినై. సుందరమ్మ తనకే మొదట కావలసింది. కాని, ఆ విషయం బయటపెట్టడానికి

అప్పట్లో ఎవరికీ ధైర్యం లేకపోయింది. అందుకు వారివారి పరిస్థితులే ముఖ్యంగా కారణాలు. ఇప్పుడు మాత్రం ఆ సుందరమ్మే కాళ్లదగ్గరకు వచ్చే అవకాశాలు కనిపించినై.

"బహుశా నా కంత అర్హత లేదేమోరా వెంకట చలం !"

"నువ్వు సరే అను. నాపాట్లు నేను పడ్తాను. మీ యిద్దరికీ రాసిపెట్టి వుంది. అందుకే మీకు ఇతరత్రా వివాహాలు ఫలించలేదు." అన్నాడు వెంకటచలం.

మర్నాడు వెంకటరత్నం బొంబాయి వెళ్లిపోయినాడు. వెంకటచలం పదిహేనురోజులు శెలవు పెట్టి పట్నం వొచ్చేశాడు.

ఇంట్లో ఎంత యుద్ధం జరగాలో అంతా జరిగింది. జరగదూ మరీ! సుందరమ్మకు మళ్లీ వివాహం చేయటం తల్లికి ఏమాత్రం ఇష్టం లేదు. తండ్రి మాట్లాడనేలేదు. ఆయన పూర్తిగా ఈ విషయంలో జోక్యం కలిగించుకోవటమే మానేశాడు. పెళ్లే చేస్తే నేను నూతిలో పడ్తా ననికూడా బెదిరించింది తల్లి. వెంకటచలానికి ఎక్కడా లేని ధైర్య మొచ్చి సుందరమ్మను బొంబాయి తీసుకుపోయినాడు.

రైలు బయల్దేరేముందు తండ్రి ఏ సందునో స్టేషనుకు వచ్చి, కొడుకుచేతికి వెయ్యి రూపాయలు వొప్ప చెప్పాడు.

సుందరమ్మతల్లి అనుకున్నట్టు నూతిలో పడలేదు గాని, సుందరమ్మమొగుడు పోయిననాడు ఎంత రభస చేసిందో అంతకన్నా ఎక్కువే చేసింది. అ దెవరూ లక్ష్యపెట్టలేదు.

సుందరమ్మకూ, వెంకటరత్నానికీ బొంబాయిలో సివిల్ మేరేజిచట్టం ప్రకారం రిజిష్టరుపెళ్లి అయిపోయింది. తండ్రిపేర ఆ వెయ్యి రూపాయలకూ, వెంకటచలం సుందరమ్మకు ఒక ఆభరణం కొన్నాడు.

సుందరమ్మ తిరిగి పుట్టింటికి వెళ్లలేదు. పెళ్లితోనే బొంబాయిలో వుండిపోయింది. వెంకటచలం ఢిల్లీ వొచ్చేశాడు.

సుందరమ్మ చాలా అదృష్టవంతురాలు—అంతా అల్లానే అనుకున్నారు. తనూ ఒకసారి కాదు; లక్షసార్లు అనుకుంటున్నది—భగవంతు డున్నాడనీ, కష్టాలు గట్టెక్కిస్తాడనీ. తాను మొదట్లో ఈ వెంకటరత్నాన్ని ప్రేమించినట్లు ఇప్పుడు హఠాత్తుగా గుర్తించింది కూడా. ప్రేమ స్పర్శతోగాని బయటపడ దని ఇప్పుడు సుందరమ్మకు అర్థమైంది.

జీవితం సుఖంగా ఎందుకు గడవాలీ? ఎవరికి గడిచింది గనక? కష్టాలన్నీ గట్టెక్కిపోయినై అని ఎందు కనుకోవాలి? అంతకన్నా తెలివితక్కువ వేరే వుండదు.

అయిదారు నెలలు గడిచినాక ఒకనాటి సాయంకాలం వెంకటచలానికి ఒక వుత్తరం అందింది. ఆ వుత్తరం వెంకటరత్నం రాసింది.

"—చాలా కష్టంలో ఈ వుత్తరం నీకు రాస్తున్నాను. ఉత్తరాలు రాసేటప్పుడు నే నెన్నడూ ఇంత కష్టపడలేదు; దుఃఖించలేదుకూడా. కాని, మనకీ ప్రపంచంలో ప్రతీక్షణమూ పరీక్షగానే వుంటుంది.

"సుందరమ్మ నిన్న అర్థరాత్రి పోయింది—ఆస్పత్రిలో. ఆమెకు నెప్పుల్లు ప్రారంభమైనై. దానితో కాంప్లికేష నే మొచ్చిందో తెలీదు. వెంటనే ఎకాఎకీ ఆస్పత్రికి ప్రయాణమయింది. ఆస్పత్రిలో చేర్చాను. మొదట్లో ప్రమాద మేమీ లే దన్నాడు డాక్టరు. మూడోనాడే రాత్రి పోయింది. ఇదే మాయిద్దరికీ రాసిపెట్టి వుంది కాబోలు.

"నా కొక్కటే చింత— ఆ పిల్ల నన్ను పెళ్లి చేసుకోకుండా వుండినా దక్కునేమో! నాకు భార్యలు దక్క రని నే ననుకుంటూ వుండేవాణ్ణి. అదే నిజమైంది. నా సంగతి ఎల్లా వున్నా, నేను నిన్నూ, నీతల్లిదండ్రుల్నీ కూడా చాలా అన్యాయం చేశాను. సుందరమ్మని దక్కించుకోటం తెలీక నా చేతులారా పోగొట్టుకున్నా ననే నా బాధ. దానికి నేను నిన్ను ఏవిధంగా క్షమాపణ వేడుకోవాలోకూడా తెలీటం లేదు. నన్ను కూడా మరచిపోవటానికి ప్రయత్నిస్తావా? అదే మంచిదేమో! నావంటి పాపాత్ము డంటూ ఒకడు పుట్టనే లే దనుకుంటే నే నెంతో కృతజ్ఞుణ్ణి.

నీ, హతాశుడు

వెంకటరత్నం."